క్లుప్తంగా

ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవోగా లక్ష్మీకాంత్‌రావ్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవోగా డీఆర్‌డీఏ కార్యాలయంలో అడ్మిస్ట్రేటీవ్ అధికారిగా పని చేస్తున్న దండనాయకుల లక్ష్మీకాంత్‌రావ్ బాధ్యలు స్వీకరించారు. ఇక్కడ గతంలో ఎంపీడీవోగా పని చేసిన శివలాల్ భుక్యా అనారోగ్యంతో మృతి చెందడంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఇన్‌చార్జీ ఎంపీడీవోగా కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్‌కు బాధ్యతలు అప్పగించారు. నూతనంగా ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీకాంత్‌రావ్‌ను ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

క్రీడ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ కప్ పోటీలకు మండలంలోని యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీకాంత్ రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి 17 వరకు మండలస్థాయి క్రీడ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకునే వారు 18 సంవత్సరాల వయస్సు నుంచి 36 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. అథ్లెటిక్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వివరాలకు 89196 01028 సంప్రదించాలన్నారు.

నిధులు మంజూరు



మాట్లాడుతున్న ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్: మండల కేంద్రంలోని ఖబరస్థాన్ నిర్మాణం కోసం ఎంపీ తుల శ్రీనివాస్ రూ.4 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం పనులను ప్రారంభించారు. అన్నిహంగులతో నిర్మాణం చేపడుతామన్నారు. ఈ సందర్భంగా ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. అనంతరం మండలంలోని లంబాడతండాలో రూ. 4 లక్షల నిధులతో సైడ్ డ్రెయిన్ నిర్మాణం ప్రారంభించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ కరం ప్రశాంత్, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువతి పెళ్లికి అండగా సర్పంచ్



తాళి, మెట్టెలు అందజేస్తున్న సర్పంచ్

తాంసి: నిరుపేద యువతి పెళ్లికి తాంసి గ్రామ సర్పంచ్ స్వప్న రత్నప్రకాష్ అండగా నిలిచారు. గ్రామానికి చెందిన సుజాత, రమేశ్‌లకు ఇద్దరు కూతుళ్లున్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం రమేశ్ ప్రమాదంలో చనిపోయాడు. కాగా ఇటీవల పెద్ద కూతురు వివాహం ఈనెల 14న నిశ్చయం అయింది. కూతురు వివాహానికి తల్లి సుజాత పడుతున్న ఆందోళనను చూసి సర్పంచ్ స్పందించాడు. తనవంతుగా బంగారు తాళి, వెండి మెట్టెలు, పట్టుచీరను ఆదివారం యువతి తల్లికి అందించాడు.

ఆర్థిక సాయం

నార్నూర్: మండలంలోని రాజులగూడ గ్రామానికి చెందిన రాథోడ్ దేవురావు (50) అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతి చెందారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన ఉద్యోగులు ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి బాధిత కుటుంబానికి రూ. 15,500 ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు.

పరామర్శ

నేరడిగొండ: మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన బద్రినాథ్ ప్రమాదవశాత్తు గుంతలో పడి గాయపడి నిర్మల్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆదివారం ఆస్పత్రికి చేరుకొని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ సాయినగర్‌లో గల రేణుకా మాతా (ఎల్లమ్మ) ఆలయ 13వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని నేతాజీ చౌక్ నుంచి మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీ కలెక్టర్ చౌక్ మీదుగా ఆలయానికి చేరుకుంది. సోమవారం ఉదయం 10.30 గంటలకు వార్షికోత్సవం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

కనీస వసతులు కరువు



చిన్న స్లాబ్‌తో శిథిలావస్థలో ఉన్న బస్టాండ్

- శిథిలావస్థలో బేల బస్టాండ్
- ఎక్కడి సమస్యలు అక్కడే
- పట్టించుకోని అధికారులు

బేల: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. బస్టాండ్ చిన్న స్లాబ్‌తో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ సైతం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన బస్టాండ్‌కు ప్రారంభంలో రెండు బస్సులు రాకపోకలు సాగించాయి. ఆ తర్వాత సరైన రోడ్డు మార్గం లేక బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. 20ఏళ్ల పాటు చెట్ల పొదలు, పిచ్చిమొక్కలతో బస్టాండ్ నిరుపయోగంగా మారింది. 2013లో గ్రామ పంచాయతీ పాలకవర్గం, స్థానిక యూత్ సభ్యులు చొరవతో పరిశుభ్రత పనులు చేపట్టి బస్సు రాకపోకల కోసం కృషి చేశారు. అప్పటి నుంచి క్రమక్రమంగా బస్టాండ్ పూర్తిస్థాయిలో ప్రయాణికులతో వినియోగంలోకి వచ్చింది.

అనేక సమస్యలు..

బస్టాండ్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. భవనం గోడలు పూర్తిగా కూలిపోయి, స్లాబ్ భాగం కొద్ది కొద్దిగా ఊడిపోతోంది. నూతన బస్టాండ్ భవన నిర్మాణాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. తాగునీరు వసతి లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్వహణను పట్టించుకోక పోవడంతో నిరుపయోగంగా మారాయి.

రెండు లక్షలకు పైబడి ఆదాయం..

జిల్లా కేంద్రం నుంచి బేల 32 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌నుంచి మండల కేంద్రానికి ప్రత్యేకంగా 6 బస్సులు ఐదేసి ట్రిప్పుల చొప్పున మొత్తంగా 30 ట్రిప్పులు రాకపోకలు సాగిస్తాయి. బస్టాండ్ నుంచి మాంగ్రుడ్, చంపెల్లి గ్రామాలకు రెండేసి ప్రత్యేక ట్రిప్పులు ఉంటాయి. ఇంతే కాకుండా మహారాష్ట్రలోని గడ్‌చాందుర్, చంద్రపూర్‌కు 8 ట్రిప్పులు ఆర్టీసీ బస్సుల రాకపోకలు సాగిస్తాయి. బస్సుల రాకపోకలతో ప్రతీ రోజు ఆర్టీసీకి రెండు లక్షలకు పైగా ఆదాయం సమకూరుతోంది.



నిరుపయోగంగా మూత్రశాలలు

అధికారులు స్పందించాలి



ఏళ్ల నుంచి ప్రయాణికుల ద్వారా లక్షకు పైబడి ఆదాయం వస్తోంది. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణను పట్టించుకోవడం లేదు. బస్టాండ్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఆదిలాబాద్ ఆర్టీసీ అధికారులు స్పందించాలి. – అగార్కర్ అకాష్, భజరంగ్ దళ్ అధ్యక్షుడు, బేల

నూతన బస్టాండ్ నిర్మించాలి



బేల బస్టాండ్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. అంతా కూలిపోయి, కేవలం చిన్న స్లాబ్ మాత్రమే మిగిలి ఉంది. వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ ప్రయాణికులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇకనైనా అధికారులు స్పందించి, నూతన బస్టాండ్ నిర్మించాలి. –వాంఖడే విజయ్, దహెగాం

పేరుకే క్రీడా ప్రాంగణం



నేరడిగొండ: గ్రామీణ ప్రాంత యువకులు క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలతో ఎలాంటి ప్రయోజనం లేదు. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసినప్పటికీ అందులో పరికరాలు బిగించలేదు. ప్రస్తుతం వేసవి సెలవుల్లో పిల్లలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. నేరడిగొండ మండలంలోని వడూర్ గ్రామంలో గల క్రీడా ప్రాంగణంలో పరికరాలు లేక వెలవెలబోతోంది. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం



క్రీడాకారులతో అనిల్ జాదవ్

నేరడిగొండ: గ్రామీణ క్రీడాకారులకు ఎల్లవేళలా అండగా ఉంటానని జెడ్పీటీసీ అనిల్ జాదవ్ అన్నారు. ఈనెల 10 నుంచి నేరడిగొండ ప్రీమియర్ లీగ్ జరగనుండగా.. క్రీడాకారులకు సంబంధించి రూ.50 వేల విలువైన క్రీడా దుస్తులు ఆదివారం ఎన్‌సీసీ సభ్యులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులు ఉన్నారని, వారికి తనవంతుగా ప్రోత్సాహం అందిస్తానని పేర్కొన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏలేటి దేవేందర్ రెడ్డి, సీనియర్ క్రీడాకారులు ప్రదీప్, చక్రపాణి, పవన్, సంతోశ్, శేఖర్ పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల కార్మికులకు ఆదివారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సీఎస్‌సీ హెల్త్‌కేర్ సెంటర్ వైద్యులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ భవన నిర్మాణ సంక్షేమ మండలి నాయకులు సయ్యద్ పర్వేస్, మహ్మద్ ఖదీర్, అజర్, రషీద్, ఫరాహన్, సృజన్, స్వేత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కులమతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌టౌన్: కులమతాల మధ్య బీజేపీ చిచ్చు పెడుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న విమర్శించారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేసే ఆపార్టీ ఆలయాల అభివృద్ధికి చేసిందేమీ లేదని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్ పోచమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న షెడ్డు పనులకు ఆదివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్‌ను హిందువులకు వ్యతిరేకంగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నారని వారిని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, రాం కుమార్, అశోక్, గంగారెడ్డి, దుర్గం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

తాంసి: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాల్లో వసతులు కల్పిస్తుందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం భీంపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.13 లక్షలతో నిర్మించే ఫార్మసీ గదికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. బాలింతకు కేసీఆర్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో భీంపూర్ వైద్యాధికారి విజయసారథి, భీంపూర్ సర్పంచ్ లింబాజీ, అనిల్, వెంకటేశ్, సర్పంచ్‌లు గంగయ్య, నరేందర్, కపిల్, నాయకులు సంతోశ్, రవూఫ్ పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- పేరుకుపోయిన చెత్తాచెదారం
- పట్టించుకోని పంచాయతీ సిబ్బంది
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



డ్రెయినేజీలో పేరుకుపోయిన పూడిక

బజార్‌హత్నూర్: మండలంలో 30 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్యం పడకేసింది. పనులు చేపట్టకపోవడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్ల సమీపంలో పెంటకుప్పలు, పిచ్చిమొక్కలు, రోడ్లపై గుంతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ సంవత్సరం జూన్ రెండో వారంలో వానకాలం ప్రారంభమవుతుంది. వర్షాలకంటే ముందే మే నెలలో పారిశుధ్య కార్మికులతో డ్రెయినేజీలు, కాలువలు శుభ్రం చేయడం, పిచ్చిమొక్కలు తొలగించడం, రోడ్లపై గుంతలను పూడ్చడం చేయించేవారు. కానీ మే నెల ప్రారంభమైన ఇప్పటికీ ఏ గ్రామంలో కూడా పారిశుధ్య పనులు చేపట్ట లేదు.

జాడలేని నిధులు..

గ్రామపంచాయతీల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం 15 ఆర్థిక సంఘం నిధులు ప్రతీ నెల మంజూరు చేస్తుంది. కానీ 2022– 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధుల్లో నాలుగు నెలల నిధులు మాత్రమే మంజూరు చేయడంతో గ్రామ పంచాయతీలకు ఇబ్బందిగా మారింది. మిగతా 8 నెలలకు సంబంధించిన నిధులు గ్రామ పంచాయతీలకు రాకపోవడంతో పనులు చేపట్టలేక పోతున్నారు. నిధులు లేక సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాల్లా చూడడం తప్పా.. పనులు చేపట్టడంలో ముందుకు వెళ్లడం లేదు. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నెలకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేసినా.. గ్రామ పంచాయతీల ఖాతాల్లో చేరడానికి మరో 15 రోజులు సమయం పట్టే అవకాశం ఉంది.

దుర్గంధం వెదజల్లుతోంది

శివాజీ మార్కెట్ వార్డులోని నాలా పిచ్చిమొక్కలతో నిండింది. గ్రామ పంచాయతీ వారు వాటిని తొలగించకపోవడంతో మురుగు నీరు సక్రమంగా పోవడం లేదు. వరద నీరు ఇళ్లల్లోకి వచ్చే అవకాశం ఉంది. నెలల తరబడి చెత్తాచెదారం తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. – షేక్ జానిమియ్య, బజార్‌హత్నూర్


పనులు చేపడుతాం

వర్షాకాలంలోపు మండలంలోని 30 గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టి డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తాం. వర్షం నీరు నేరుగా వెళ్లడానికి కాలువల్లో పూడిక తీయిస్తా. ఇళ్ల పరిసరాల్లో, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, పెంట కుప్పలను తొలగిస్తాం. – మహేందర్‌రెడ్డి, ఎంపీవో, బజార్‌హత్నూర్

ఆధ్యాత్మికం వైపు అడుగులు



సప్తాహ కార్యక్రమానికి హాజరైన మహిళలు



ప్రసంగిస్తున్న దేవకినందన్ మహరాజ్

- గ్రామాల్లో పెరుగుతున్న భక్తిభావన
- ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భారీ ఖర్చు

ఇచ్చోడ: ఆధ్యాత్మికం వైపు పల్లెలు అడుగులు వేస్తున్నాయి. ఆధ్మాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు. నియోజకవర్గంలో ఇచ్చోడ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, బోథ్ మండలాల్లో ఏ గ్రామంలో చూసినా.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భగవతం కథం, హరినామ సంకీర్తన, సప్తాహలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

పండుగ వాతావరణం..

గ్రామాల్లో ఏటా వేసవిలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొంటుంది. భాగవతం కథలు, పగటి పూట, సప్తాహ కార్యక్రమాలు తిలకించేందుకు అనేక గ్రామాల ప్రజలు వస్తుంటారు. ఆధ్యాత్మిక ప్రవచనాలతో పాటు యువత చెడు వ్యసానాలకు దూరంగా ఉండాలని, తల్లితండ్రులను గౌరవించాలని హితబోధ చేస్తారు. నేటి యవత రానున్న రోజుల్లో దేశానికి చేయాల్సిన సేవలను వివరిస్తారు.

ఖర్చుకు వెనుకాడని నిర్వాహకులు..

ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రజలు, నిర్వహకులు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వీటి కోసం దాతలూ విరివిగా విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నారు. జనాభా తక్కువ ఉన్న చిన్నచిన్న గ్రామాల్లో అందరూ కలిసి డబ్బు పోగు చేసుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత స్వచ్ఛందంగా భాగస్వాములై ముందుండి నడిపిస్తున్నారు. అఖండ హరినామ సప్తాహం, భగవత కథ నిర్వహణకు రూ. 2 నుంచి రూ. 4 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. గురు దక్షణ స్తోమత బట్టి ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవల బజార్‌హత్నూర్ మండలంలోని మంక్రాంతండాలో వారం రోజుల పాటు భగవత కథ నిర్వహించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని మథుర నుంచి దేవకినందన్ మహరాజ్ హాజరై ప్రసగించారు. ఆయన ప్రసంగానికి రూ. 23 లక్షలు గురు దక్షణ తీసుకోగా.. వారం రోజుల పాటు కార్యక్రమం నిర్వహణ కోసం కోటికి పైగా ఖర్చు అయింది.

అనేక విషయాలు తెలుస్తాయి



ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా దేశభక్తి, తోటి మనిషిపై గౌరవం, సాయం చేయలన్న ఆలోచన పెరుగుతోంది. మనకు తెలియని ఎన్నో విషయాలు తెలుస్తాయి. మహత్ముల సందేశాలతో మనసు పులకించి పోతుంది. – కధం కామాజీ, అడేగామ(బి)

గొప్ప అనుభూతినిస్తుంది



ఆధ్మాత్మికం ప్రవచనాలు వినడంతో గొప్ప అనుభూతినిస్తుంది. గ్రామాల్లో వారం రోజుల పాటు నిర్వహించే సప్తాహ కార్యక్రమాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తుంది. గ్రామస్తులంతా ఆధ్మాత్మిక చింతనతో ఆనందాన్ని పంచుకుంటారు. – నవులే సంజీవ్, ముఖరా(కె)

నిరుపేదలకు వరం కల్యాణలక్ష్మి



పెళ్లి కానుక అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి పేదలకు వరంలా మారిందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని వడగామ్ పరి దిలోని సకారంతండాలో జరిగిన పెళ్లి వేడుకలో పాల్గొని వధూవరులకు పెళ్లి కానుక అందజేశారు. ఆడబిడ్డ పెళ్లి భారం కాకుడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈసదర్భంగా సకారంతండా గ్రామానికి రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జాదవ్ స్వర్ణలత పాల్గొన్నారు.

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: కుంటాల ఆరాధ్యదైవం శ్రీ గజ్జల మ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహారాష్ట్రలోని నాందేడ్, బోకర్, ధర్మాబాద్, శివుని, అప్పారావుపేట్, మలక్ జాం తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. శ్రీ గజ్జలమ్మ దేవికి అభిషేకం, అలంకరణ, పల్లకిసేవను గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

లోకేశ్వరం: యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని పీఏసీఎస్ చెర్మన్ రత్నకార్‌రావు సూచించారు. మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు.

కొండగట్టుకు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న హనుమాన్ స్వాములు

తలమడుగు: మండలంలోని కుస్లాపూర్ గ్రామంలో హనుమాన్ దీక్షపరులు 200 మంది కొండగట్టు ఆలయానికి ఆదివారం పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఊరేగింపుగా సాగనంపారు. హనుమాన్ దీక్షపరులు 12 ఏళ్లుగా కొండగట్టు ఆలయానికి పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. మాజీ మంత్రి రామచంద్రారెడ్డి, సర్పంచ్ ప్రభ దేవరావు, ఎంపీపీ కల్యాణలక్ష్మి రాజేశ్వర్, అశోక్ పాల్గొన్నారు.